

# సేవకుడు

అనిశెట్టి లక్ష్మీ అప్పారావు

ఈశ్వర్రావొక చిన్న హోటలు నడుపుతున్నాడు. అతనికి కుడిభుజం లాంటివాడు రాము.

ఈశ్వర్రావు సహృదయుడు. అతని అమాయక చూపులు కొత్తవాణ్ణి ఇట్టే ఆకర్షించెయ్యగలవు.

ఒకనాడు గల్లాలో రూపాయి తగ్గింది లెక్కకి. అప్పుడే అన్నాని కెళ్లేడు రామూ. ఈశ్వర్రావుకు బాగా తెల్సు రామూ నమ్మకమైన వాడని.

మానవునికి సహజంగా రెండు దుర్గుణాలు ఉంటయి. ఒకటి : డబ్బునుచూస్తే కాజేయాలనుకోవడం, రెండోది : ఉన్నడబ్బు పోతే ప్రతివాణ్ణీ దొంగక్రింద లెక్క వెయ్యడం.

కాబట్టి ఈశ్వర్రావులో అనుమానం జాస్తయ్, రాము వున్న గల్లీకెళ్ళి, "రామూ" అని తలుపు తట్టాడు.

"ఏం అన్నాయ్! ఎండవేళొచ్చేవు ?"— తలుపుతీస్తూ వినయంగా, తమ్ముడిలా అన్నాడు రామూ.

ఈశ్వర్రావుకు కోపం రాదు సామాన్యంగా. ఈ తరహా మనుష్యులకు కోపం వస్తే భూమ్యాకాశాలు ఏక మాతయ్.

కళకళలాడ్తున్న రామూ మొహం వివర్ణమై యజమానిని చూశ్లేనిభయంలో తలవాల్చి, 'డబ్బేమన్నా—పో...యి...ందా' మాటలు వెతుక్కుంటున్నాడు.

ఒక్కోసారి రామూ ఒక్కడే వుంటాడు హోటల్లో. హోటలు చిన్నది గనుక డబ్బు ఎప్పటికప్పుడు లెక్కించడం, ఈశ్వర్రావు దినచర్యల్లోని సిజర్సు కాల్చడం లాంటిది.

ఎప్పుడేనా డబ్బు తగ్గితే తన జీవనాధారం కాస్తా వూడ్తుందని అప్పుడప్పు డాలోచనలో పడేవాడు రామూ. ఆ ఊహే ఇప్పుడూ తట్టి అడిగాడు రామూ. కానీ తన సొద ఈశ్వర్రావు అనుమానం బలపడ్డానికి కారణ మౌతుందని కల్లోగూడా తలంచలేక పోయాడు, పిచ్చి రామూ!

"నువ్విలా చేస్తావని నేను కల్లోగూడా అనుకోలేదు రామూ! అవును, బుద్ధి పాడుది, దానికి నీ జవాబ్దారీ ?—నువ్వెం కెక్కడైనా పని చూసుకో."

జాలి చూపుల్తో, పాదాలను బరువుగా వేస్తూ వెళ్ళాడు ఈశ్వర్.

రామూకి మతి తిరిగినట్టయింది. వెళ్లి మంచం మీద పడ్డాడు.

తలుపుచాటునుండి వింటున్న సరోజకు స్పృహ తప్పినట్టయ్యే, తన అన్న, రామూ ఇలా ప్రవర్తిస్తాడా ?-ఇదే ప్రశ్న ఆమె హృదయంలో వేయి బల్లాలు గుచ్చినట్లయింది. అంతరాత్మ తరచితరచి ప్రశ్నిస్తుంది. తనేమని జవాబివ్వగలదు ? సరోజకు కష్టాలతో పరిచయముంది. అందుకనే తనను తనే ఓదార్చుకుని, అన్నను సముదాయించి, బలవంతంమీద అన్నానికి కూచోబెట్టింది.

సరూ ఎర్రని మెత్తని చేతులతో, చిక్కని తెల్లని మజ్జిగ పోస్తుంటే రోజూ సంతోషంగా తాగే రామూకి మజ్జిగ సయించలేదు. పదార్థాల మీద రుచి తగ్గుతుంది. సరూ ఏంచేస్తుంది ?

★

క్యాలండర్ కాగితాలు నెలవరకూ చినిగినయ్యి. రామూలేని ఈశ్వర్రావుకి కుడిచెయ్యి విరిగినట్టయింది.

ఈశ్వర్రావు సిగరెట్లవాడికి డబ్బివ్వాల్సి చాలా నాళ్లయిందనుకుని ఒకరూపాయి తీసుకుని అంగడికెళ్ళాడు.

"ఇదుగో ఈ రూపాయి తీసుకో, సోమూ ! చాన్నాళ్లయింది, బాకీ యివ్వక."

"లక్ష్మివారం నాడే యిచ్చావ్ కదటోయ్ ! ఇంత మతిమరుపైతే హోటలు బాగానే సాగుతుంది !"

"ఆ ! ఏవన్నావ్, మొన్ననే ఇచ్చానా ?" దెబ్బతిన్నలేడిలా, సోమూ సమాధానానికెదురు మాడక, మరుక్షణంలో, రామూ వుంటున్న గల్లీన పడి, "రామూ ! నా రామూ" అని దిగులుగా అరచుకుంటూ వెళ్లాడు ఈశ్వరరావ్.

"తప్పంతా నాదే, నన్ను క్షమించు రామూ, అయ్యో ! రేపు హోటలుకు రా బాబూ ! అంతా నీదే, రావూ ?" రామూకి వూపిరి సలుపకుండా ప్రశ్నార్థకంగా ప్రాధేయపడ్డాడు, యజమాని.

"అలాగే అన్నా ! తప్పక వస్తా, నీవేదిచెప్పినా యీ సేవకుడు తప్పక చేస్తాడు" అన్నాడు రామూ.

బందిఖానానుండి విడుదలైన ఖైదీ ముఖంలా, రామూ ముఖంలో, ఆనందజ్యోతి వెల్గింది. తన్మయంలో మునిగాడు.

సరూ మొహం విచ్చిన గులాబీలా గైంది.

ఈశ్వర్రావు గుప్‌మని వెలిగిన గ్యాస్‌లైట్‌లా నవ్వాడు.

* ఆనందవాణి

## కొత్త జోలపాట

● మరువాడ సూర్యప్రకాశం ●

నిద్రపో మోహినీ! నిద్రపో తల్లీ
సినీమాకి పోవాలి నిద్రపోవమ్మా !

నాన్నగారూ వచ్చి నిన్ను లేపినచో
నేను వచ్చేసరికి వండమనిచెప్పా ॥ని॥

చక్కన్ని చిటితలికి పెళ్ళిడు వస్తే
కట్నమ్ము యివ్వనిచో పరువురాదేమో ॥ని॥

అమ్మాయి అత్తారు పల్లెటూళ్లైతే
కాఫీకి కరువగును తెలివాటుసరికే ॥ని॥

చదువుకో నా తల్లీ నేర్చుకోకట్టూ
సరిగమలు పాడవే పెళ్ళి బావెదుటా ॥ని॥

అల్లుడూవస్తేను సిగ్గుపడకమ్మా
వెండితెర తారవలె నటియించుతల్లీ ॥ని॥

ఏడుపెందుకు నిన్ను ఎవరు కొట్టేరూ
పాలడబ్బా పాలూ పట్టెదనూ నీకూ ॥ని॥

రేషనూ సరిపోక యిబ్బంది వస్తే
అతిథులూరాగానేమంచమెక్కూ తల్లీ ॥ని॥